క్లుప్తంగా

రైల్వే స్టాఫ్ రెస్ట్ రూం ప్రారంభం



రెస్ట్ రూమ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి డీజిల్‌షెడ్‌లో నూతనంగా నిర్మించిన రైల్వే స్టాఫ్ రెస్ట్ రూమ్‌ను డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్, ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ ప్రియాంక రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఎంఈలు అశోక్‌గౌడ్, సుంకన్న, ఎస్ఎస్‌సీ జనరల్ మనోజ్, గోవిందరాజులు, విజయానంద్, మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ రామాంజుల రెడ్డి, చైర్మన్ మంజునాథ్, ఎస్సీ, ఎస్టీ సెక్రెటరీ రాంనాయక్ , మజ్దూర్ యూనియన్ సీనియర్ నాయకులు రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్డీటీని రక్షించుకుందాం



సేవ్ ఆర్డీటీ అంటూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: పేద ప్రజలకు అండగా నిలిచిన ఆర్డీటీని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు కత్తుల కొండయ్య, సంఘం సభ్యులు ఓబిలేసు, మారయ్య, సుధాకర్ కోరారు. సోమవారం మండలంలోని ఆర్డీటీ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సేవ్ ఆర్డీటీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది ప్రజలతో కలసి సంఘం సభ్యులు గుత్తిరోడ్డు సర్కిల్ లో మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఉషారాణికి అందించారు. కార్యక్రమంలో రామచంద్ర, శ్రీరాములు, భూపతి, పలువురు నాయకులు మహిళలు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీపై అవగాహన కల్పించాలి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు

యాడికి: ఈ నెల 20న ప్రపంచ దోమల నివారణ దినోత్సవం ఉండటంతో మండలంలోని ప్రతి పంచాయతీలో ర్యాలీ నిర్వహించి ప్రతి పాఠశాలలో మలేరియా, డెంగీ జ్వరంపై అవగాహన కల్పించాలని ఏఎన్‌ఎంలకు తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండలంలోని రాయలచెరువు గ్రామంలోని పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం యాడికి 4వ సచివాలయం పరిధిలోని పెద్దపేట గ్రామంలో యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్‌లో ఎఫ్–2 డైరీని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నేత శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కమిషనర్ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. చిన్నపాటి వర్షానికే లోతట్టు కాలనీలు జలమవుతున్నాయని, డ్రైనేజీల్లో పూడిక తీయించాలని గగ్గోలు పెట్టినా కమిషనర్ పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. పట్టణంలో స్వైరవిహారం చేస్తున్న కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలన్నారు. మున్సిపల్ కమిషనర్, అధికారులు మొద్దు నిద్రను వీడి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆయన హితవు పలికారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం కమిషనర్ నయీమ్‌కు డిమాండ్లతో కూడిన పత్రాన్ని అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు రమేష్, నాగరాజు, సురేంద్ర, తిమ్మప్ప, సుగుణ, షాకీరా పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహావిష్కరణ

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద సోమవారం మహాదేవుని విగ్రహాన్ని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



అలంకరణలో మహాదేవుడు

చెరువు కాదు.. ఆస్పత్రే!

- పీహెచ్‌సీని చుట్టేసిన వర్షం నీరు
- అపరిశుభ్రంగా ప్రాంగణం



యల్లనూరు ఆస్పత్రి ఆవరణలో చెరువును తలపిస్తున్న దృశ్యం

యల్లనూరు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు యల్లనూరు పీహెచ్‌సీ ప్రాంగణం వరద నీటితో చెరువును తలపిస్తోంది. దీంతో రోగులు ఆస్పత్రికి వెళ్లేందుకు జంకుతున్నారు. ఆస్పత్రికి వెళ్తే ఉన్న రోగానికి చికిత్స మాట అలా ఉంచితే.. కొత్త రోగం వచ్చే అవకాశం ఉందంటూ భయాందోళన వ్యక్తం చేశారు. అలాగే ఆస్పత్రి ప్రాంగణం లోపల, బయట వర్షపు నీరు నిల్వ ఉండడంతో విష సర్పాలు లోపలికి వస్తాయోమేనని వైద్య సిబ్బంది బెంబేలెత్తుతున్నారు. చీకటి పడగానే ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో డ్యూటీ చేసే నర్సులు, సిబ్బంది అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని కాలాన్ని నెట్టాల్సి వస్తోంది. అచ్చుకట్ల వీధిలో నుంచి వచ్చే మురుగునీరు పీహెచ్‌సీ ముందుకు చేరుతుంది. పీహెచ్ నుంచి బయటకు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో అక్కడే నిలుస్తోంది. దీంతో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వర్షంనీరు, డ్రైనేజి నీటిని బయటకు పంపితే సమస్య పరిష్కారమవుతుంది. దీంతో కాలనీవాసులు రోగాల బారిన పడకుండా ఉంటారు. లేకుంటే దోమలు వ్యాప్తి చెంది మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర వ్యాధులు సోకే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. సమావేశాల్లో వ్యక్తిగత పరిశుభ్రత తోపాటు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యుడు లోకేష్‌కుమార్ పదేపదే చెబుతుంటారు.. వారి పరిసరాలను శుభ్రం చేసుకోరా? అని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు.



పీహెచ్‌సీ భవనం ఎదుట నిలిచిన వర్షపు నీరు



ఆస్పతి ఎదుట అపరిశుభ్రంగా ఉన్న కాలువ



వర్షపు నీటిలో ఉన్న స్ట్రెచర్

జీఓ 30 రద్దు చేయాలని నిరసన



మాట్లాడుతున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లోనికి ఎవ్వరూ వెళ్లకూడదని కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 30ని రద్దు చేయాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ సోమవారం వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను నీరుగార్చడమే మంత్రి లోకేష్ లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలు బయటికి తెలుస్తాయని భయపడే ప్రభుత్వం ఈ నల్ల జీఓను తీసుకొచ్చిందన్నారు. జైళ్లల్లో ఉన్న ఖైదీలను కలవడానికి వెసులుబాటు ఉన్నా స్కూళ్లల్లో విద్యార్థులను కలవనివ్వకుండా చేసిన ఘనత దేశంలో చంద్రబాబు సర్కారుకే దక్కుతుందన్నారు. ఆ జీఓను రద్దు చేయకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు సక్కానారప్ప, పట్టణ, మండల అధ్యక్షులు మణికంఠ, అనిల్‌కుమార్, వలంటీర్ విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు పవన్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు విష్ణుసాయి, విద్యార్థి నాయకులు జయరెడ్డి, శివ, అభి, అశోక్, మధు, అజయ్, గణేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

'బండారు శ్రావణి నుంచి ప్రాణహాని'



మాట్లాడుతున్న టీడీపీ కార్యకర్త ప్రసాద్

అనంతపురం టవర్‌క్లాక్: ఎమ్మెల్యే బండారు శ్రావణి నుంచి ప్రాణహాని ఉందని, రక్షించాలని టీడీపీ కార్యకర్త కనంపల్లి ప్రసాద్ కోరారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శింగనమల నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి గెలుపు కోసం కష్టపడ్డానని, గెలిచాక తనపై ఆమె పోలీసులతో కేసులు పెట్టించారని ఆయన వాపోయారు. కనంపల్లి పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఇవ్వాలని ఎమ్మెల్యేను అడిగానని, అయితే ఆమె ఆర్మీలో పనిచేసే వ్యక్తి భార్యకు డబ్బులకు అమ్ముకుందన్నారు. ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నిస్తే తనపై మూడు కేసులు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పార్టీ నాయకులు, నారా లోకేష్ దృష్టికి తీసుకపోయినా న్యాయం చేయలేదన్నారు. జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశానన్నారు. తనకు బండారు శ్రావణి నుంచి ప్రాణహాని ఉందని, రక్షించాలన్నారు.

దివ్యాంగ పింఛన్ల తొలగింపు అన్యాయం



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు: రీ వెరిఫికేషన్ సాకుతో దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయమని సీపీఐ నాయకు లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సీపీఐ పట్ట ణ కార్యదర్శి ఎస్.గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్.ఎం.డి. గౌస్, జిల్లా సమితి సభ్యుడు బి.మహేష్ తదితరుల నేతృత్వంలో రీ వెరిఫికేషన్ పేరిట దివ్యాంగులకు జరుగుతున్న అన్యాయంపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో రీ వెరిఫికేషన్ పేరుతో దాదాపు 390కి పైగా దివ్యాంగుల పింఛన్లు రద్దు చేయడం సబబు కాదన్నారు. అధికారులు స్పందించి అర్హులైన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలోని దొనిముక్కల రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలన్నారు. బీటీ ఫక్కీరప్ప కాలనీలో మున్సిపల్ కొళాయిలకు నీరు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ప డుతున్నారని, సమస్య పరిష్కరించాలన్నారు. నాయకులు దేవేంద్ర, పుల్లయ్య, కత్తి శీన, మధుబాబు పాల్గొన్నారు.

కమ్యూనిటీ ఆస్పత్రికి ర్యాకుల వితరణ

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రికి సోమవారం స్థానిక నైటీల వ్యాపారి నల్లఖాదర్ రెహమాన్ రూ.20 వేలు విలువ చేసే రెండు ర్యాకులను వితరణగా అందజేశారు. ఆస్పత్రిలో మందులు నిల్వ చేసుకోవడానికి అవసరమైన ర్యాకులు లేక సిబ్బంది ఇబ్బంది పడేవారు. ఈ విషయం తెలుసుకున్న రెహమాన్ ఈ ర్యాకులను ఆస్పత్రి వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి సమక్షంలో అందజేశారు. దాతకు వైద్యులతోపాటు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చిలకల రాజగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: అనంతపురం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మాంటిస్సోరి స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పలువురు విద్యార్థులు చాటారు. సోమవారం ఈ పోటీలను మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్లు నాగార్జున, అనిల్,వంశీ ప్రారంభించారు. జిల్లా నుంచి సుమారు 150 మంది విద్యార్థులు, యువత పాల్గొని యోగాసనాల్లో ప్రతిభ కనబరిచారు. పోటీల్లో వివిధ కేటగిరిల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన వారిని వచ్చే నెల 6,7 తేదీల్లో తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు యోగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మనోహర్ రెడ్డి తెలిపారు. అనంతరం యోగా పోటీల్లో రాణించిన పలువురు విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

శింగనమల: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా సమితి సభ్యుడు భాస్కర్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో దళిత కాలనీలకు శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని కోరారు. రాచేపల్లి వద్ద ఉన్న లీడ్ క్యాప్‌ను పునఃప్రారంభిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు వాగ్దానం చేశారని, నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. గ్రామాల్లో వీధి దీపాలు వేయించాలన్నారు. మండలంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయని, వెంటనే వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామాంజనేయులు, జయరాముడు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేయండి



ఎస్సీ కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగు

శింగనమల: శింగనమలలోని ఎస్సీ కాలనీలోని ఒక వీధిలో సీసీ రోడ్డు వేయకపోవడంతో, మురుగు, వర్షం నీరు నిల్వ ఉండడంతో రోగుల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. కాలనీలో అన్ని వీధులకు సీసీ రోడ్లు వేసినా తమ వీధిలో వేయలేదన్నారు. అధికారులు స్పందించి, సీసీ రోడ్డు, మురుగు కాలువ నిర్మించాలని కాలనీవాసులు కోరారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీరు నిల్వ ఉండి, దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు.

దత్త మహాయోగ పీఠంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో దత్తాత్రేయుడు



హోమం చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని దత్త మహాయోగ పీఠంలో శ్రావణ మాస దశమిని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సురేంద్ర మహారాజ్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ విశేష పూజలు చేశారు. గణపతి, నవగ్రహ, గురు దత్తాత్రేయ పూజలు నిర్వహించారు. అనంతరం శివాభిషేకం, గణపతి సర్వదేవత మృత్యుంజయ హోమాలు చేశారు. భక్తులు దత్తాత్రేయుడికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

'విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి'

గుత్తి: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ పద్మనాభ పిళ్లై సూచించారు. గుత్తిలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలన్నారు. కరెంట్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలని నిరసన

గుత్తి రూరల్: ఉపాధి హామీ కూలీలకు ఎనిమిది వారాలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చందు, కోశాధికారి వన్నూరమ్మ డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి బిల్లులు చెల్లించాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో జాబ్ కార్డులు ఉన్న ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలన్నారు. మెడికల్ కిట్లు, పనిముట్లు పంపిణీ చేయాలన్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం తహసీల్దార్ పుణ్యవతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జయమ్మ, వెంకటలక్ష్మి, అలివేలమ్మ పాల్గొన్నారు.

పగలే వెన్నెల..



యాడికి ప్రభుత్వాస్పత్రి ఎదుట పగలే వెలుగుతున్న వీధి దీపం (ఇన్‌సెట్‌లో) యాడికి పంచాయతీ కార్యాలయం ఎదుట వెలుగుతున్న లైట్

యాడికి: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. వాటికి స్విచ్‌లు లేకపోవడంతో రాత్రి, పగలు వెలుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు విద్యుత్‌ను ఆదా చేయాలని చెబుతూ.. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. యాడికి మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి ఎదురుగా ఉన్న కోన రోడ్డులోని విద్యుత్ స్తంభం, గౌతమి స్కూల్ ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం, యాడికి పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు రాత్రి, పగలు తేడా లేకుండా నిరంతరాయం వెలుగుతూ ఉన్నాయి. అధికారులు స్పందించి వీధి దీపాలకు వీధిదీపాలకు స్విచ్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుత్తి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీలో ప్రవేశాలకు వెంటనే అడ్మిషన్లను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలవుతున్నా డిగ్రీ విద్యార్థులకు ఇంత వరకూ అడ్మిషన్లు జరగలేదన్నారు. రెండు వారాల నుంచి వర్షాలు కురుస్తున్నాయని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. జీఓ 77 రద్దు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా జీఓ గురించి విద్యాశాఖ మంత్రి లోకేష్ మాట్లాడటం లేదన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ పుణ్యవతికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్‌యాదవ్, చరణ్, థామస్, జగన్, ఓంసాయియాదవ్ పాల్గొన్నారు.

'సోలార్'లో స్థానికులకే ఉద్యోగాలివ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లిలో ఏర్పాటు చేస్తున్న రెన్యూ సోలార్ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం డీవైఎఫ్ఐ నాయకులు ధర్నా చేశారు. డీవైఎఫ్ఐ నాయకులు అశోక్, ప్రశాంత్ మాట్లాడుతూ గుత్తి మండలం, మునిసిపాలిటీలో ఉద్యోగ అవకాశాలు లేక యువత ఇతర పట్టణాలకు వలస వెళ్లాల్సి వస్తోందన్నారు. గుత్తి పట్టణంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి సరైన నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నారు. గతంలో ఉన్న ఉపాధి శిక్షణ కేంద్రాలన్నీ మూతవేయడం దారుణమన్నారు. బేతాపల్లిలో ఏర్పాటు చేస్తున్న సోలార్ పరిశ్రమలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ఉద్యోగాలు కల్పిస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు రంగ, ప్రసాద్, రమేష్, నవీన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మల్బరీ సాగుతో అధిక లాభాలు

బుక్కరాయసముద్రం: రైతులు మల్బరీ సాగులో అధిక లాభాలు సాధించవచ్చని పట్టు పరిశ్రమ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మురళి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రెడ్డిపల్లిలో పట్టు సాగు, పట్టు పరిశ్రమపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టు సాగులో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ రమ్య, సెరికల్చర్ అధికారి మెహతాజ్ సుల్తానా, టెక్నికల్ అసిస్టెంట్ రమాకాంత్, అంజన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

గార్లదిన్నె: మండలంలో ఎరువుల దుకాణాలను ఏడీ అల్తాఫ్ అలీఖాన్ సోమవారం తనిఖీ చేశారు. కల్లూరులో తిరుమల ఫర్టిలైజర్ షాపులో ఉన్న యూరియా నిల్వలు, స్టాక్ రిజిస్టర్, గోడౌన్ రిజిస్టర్లకు 200 బ్యాగులు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో షాపు యజమానికి షోకాజ్ నోటీసు, సేల్ స్టాఫ్ నోటీసును ఇచ్చారు. దుకాణాల్లో రిజిస్టర్లను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విక్రయించిన మందులకు బిల్లులు ఇవ్వాలన్నారు. ఏఓ సాయిలక్ష్మి, ఏఈఓ హరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

గార్లదిన్నె: మండలంలోని జమ్ములదిన్నె కొట్టాల ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు అనంతపురం సెంట్రల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. క్లబ్ గవర్నర్ కేశవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణలో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాల మెటీరియల్‌తో పంపిణీతో పాటు పాఠశాలకు 12 వేల విలువగల బీరువా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరమణ నాయక్, రోటరీ యూత్ లీడర్ షిప్ అవార్డు చేర్మెన్ శాంతారాజ్, లీగల్ అడ్వయిజర్ మల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వన్నప్ప, డాక్టర్ ప్రదీప్‌కుమార్, ప్రేమకుమార్, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పామిడి: అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని పీ కొండాపురం గ్రామానికి చెందిన పురేంద్ర(36) మృతి చెందినట్లు పామిడి పోలీసులు సోమవారం తెలిపారు. ఈ నెల 13న పీ కొండాపురం రోడ్డులోని తిరుమల ఫంక్షన్ హాల్ సమీపాన అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు అనంతపురంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మృతిచెందాడు. అతడికి భార్య శ్యామల, ఇద్దరు కుమార్తెలున్నారు. ఎస్ఐ బీఆర్ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యలపై 2 వినతులు

యల్లనూరు: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి భూ సమస్యలపై రెండు వినతులు వచ్చినట్లు తహసీల్దారు రాము తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ మనోహర్‌బాబు, హెల్త్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు హాజీవలి, రాజామణి, హార్టీకల్చర్ అసిస్టెంట్ రామాంజనేయులు, పశువైద్యశాల లైవ్‌స్టాక్ అసిస్టెంట్ రేష్మ తదితరులు పాల్గొన్నారు.